
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 30 ఏప్రిల్ 2024



అరవై వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లు 8లో..

కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం 8లో..




'పెద్దపల్లి' బరిలో 42 మంది

- ఏడుగురు అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ
- ముగిసిన ఉపసంహరణల పర్వం
- తెలుగు అక్షరమాల ప్రకారం బ్యాలెట్‌లో పేర్లు
- వచ్చేనెల 13న పోలింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 42 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసే నాటికి ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ నియోజక వర్గానికి మొత్తం 63 మంది అభ్యర్థులు 109 సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 14 మంది అభ్యర్థులకు చెందిన 23 నామినేషన్ సెట్లను తిరస్కరించారు. మిగిలిన 49 మంది అభ్యర్థుల్లో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు గవ్వల శ్రీకాంత్, జాడి బాల్‌రెడ్డి, మోటం రవీందర్, జుమ్మిడి గోపాల్, జాడి ప్రేమ్‌కుమార్, దుర్గం సమ్మయ్య, దాగం సుధారాణి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 42 మంది పోటీలో ఉన్నారు. ఇందులో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు బీఎస్పీ, ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు సైతం పోటీ చేస్తున్నారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో 17 మంది అభ్యర్థులు పోటీ పడగా, ఇప్పుడు ఆ సంఖ్య రెండింతలు దాటింది. దీంతో ఒక్కో పోలింగ్ బూతులో మూడు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 42 మంది అభ్యర్థులతో పాటు ఒకటి నోటాకు కేటాయించనున్నారు. అలాగే బ్యాలెట్‌లో ముందుగా గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, తర్వాత గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలు, ఆ తర్వాత వరుసలో రిజిష్టర్డు జాతీయ, రాష్ట్ర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు తెలుగు అక్షరమాల క్రమంలో బ్యాలెట్‌లో చేర్చి గుర్తులు కేటాయించారు. దీంతో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనున్నది. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటి ప్రచారంచేయిస్తున్నారు. ప్రచార రథాలను తిప్పుతూ ప్రచారం చేస్తున్నారు. వచ్చే నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనున్నది.



పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే..

అభ్యర్థి	పార్టీ	గుర్తు
1. ఇరుకుల్ల రాజయ్య	బీఎస్పీ	ఏనుగు
2. ఈశ్వర్ కొప్పుల	బీఆర్ఎస్	కారు
3. వంశీకృష్ణ గడ్డం	కాంగ్రెస్	చేయి
4. శ్రీనివాస్ గొమాసే	బీజేపీ	కమలం పువ్వు
5. ఇరుగురాల భాగ్యలక్ష్మి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	పిల్లనగ్రోవి
6. అంబోజు సుమలత	అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ	చపాతిరోలర్
7. కనకయ్య ముల్కల	సోషలిస్టు పార్టీ ఇండియా	టార్చిలైట్
8. కాశి సతీష్ కుమార్	యాంటి కరప్షన్ డెమొక్రటిక్ పార్టీ	పనసకాయ
9. కంది చందు	రాష్ట్రీయ మానవ్ పార్టీ	పొరులు
10. చిలుక ఆనందర్	యువతరం పార్టీ	గ్యాస్‌సిలిండర్
11. దుర్గం సంతోష్	ప్రజా రాజ్య సమితి	బీరువా
12. రాంచందర్ నిచ్చకోల	దళిత బహుజన పార్టీ	గాజు గ్లాసు
13. మొలుగు వెంకటేష్	న్యూ ఇండియా పార్టీ	బేబి వాకర్
14. మోతె నరేశ్	పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా	పండ్ల బుట్ట
15. రమేష్ మంద	ధర్మ సమాజ్ పార్టీ	చెప్పులు
16. వేణుగోపాల్ మొయ్యి	బహుజన్ ముక్తి పార్టీ	మంచం
17. అక్కపాక తిరుపతి	స్వతంత్ర	విజిల్
18. ఆర్నకొండ రాజు	స్వతంత్ర	కత్తెర
19. ఇరికిల్ల రాజేష్	స్వతంత్ర	బెలూన్
20. కట్కూరి సందీప్	స్వతంత్ర	గాజులు
21. కాదాసి శేఖర్	స్వతంత్ర	ఓడ
22. కుర్మ మహేందర్	స్వతంత్ర	గ్యాస్ పొయ్యి
23. కొంకటి లింగమూర్తి	స్వతంత్ర	బ్యాట్స్‌మెన్
24. గడ్డం మారుతి	స్వతంత్ర	డబ్బా
25. చందనగిరి శ్రీనివాస్	స్వతంత్ర	పూసల దండ
26. జూపాక కిరణ్	స్వతంత్ర	బెల్ట్
27. తాళ్లపల్లి నరేష్	స్వతంత్ర	మైక్
28. దాగం శ్రీనివాస్	స్వతంత్ర	టెలివిజన్
29. దుర్గం రాములు	స్వతంత్ర	కుట్టుమిషన్
30. దూడ మహిపాల్	స్వతంత్ర	క్యారంబోర్డు
31. నరేష్ జనగామ	స్వతంత్ర	బెంచ్
32. నవీన్ నూకల	స్వతంత్ర	బ్యాట్
33. బూడిద తిరుపతి	స్వతంత్ర	సైకిల్‌పంప్
34. బొట్ల చంద్రయ్య	స్వతంత్ర	సీసీటీవీ కెమెరా
35. మామిడిపల్లి బాపయ్య	స్వతంత్ర	ఉంగరం
36. ముల్కల్ల రాజేంద్రప్రసాద్	స్వతంత్ర	వజ్రం
37. మేకల అక్షయ్ కుమార్	స్వతంత్ర	కెమెరా
38. రాజేశం రాచర్ల	స్వతంత్ర	బ్లాక్ బోర్డు
39. రాజ్ కుమార్ దుర్గం	స్వతంత్ర	బైనాక్యులర్స్
40. రాముల కార్తీక్	స్వతంత్ర	రోడ్ రోలర్
41. డాక్టర్ వసర్ల నతానియల్	స్వతంత్ర	బకెట్
42. శ్రీనివాస్ పంటుకల	స్వతంత్ర	బిస్కెట్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ రావీష్ గుప్తా

పాలకుర్తి, ఏప్రిల్ 29: మండలం పరిధిలోని వేమునూర్, బసంత్‌నగర్, కుక్కలగూడూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం అబ్జర్వర్ రావీష్ గుప్తా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ తేదీలోపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట లైజన్ అధికారి అనీల్, ఆర్ఐ మూల భానుకుమార్, సీనియర్ అసిస్టెంటు బండి పోచయ్య, ఎస్ఐ ఆర్ స్వామి తదితరులున్నారు.

ఎన్టీపీసీలో 176 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ విస్తరణ



భూమిపూజ చేస్తున్న ఈడీ కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్, ఏప్రిల్ 29 : ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ విస్తరణకు శ్రీకారం చుట్టారు. 176 మెగావాట్ల కొత్త సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు సోమవారం భూమిపూజ చేశారు. ఇప్పటికే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, 10మెగావాట్ల సౌర విద్యుత్(సర్ఫేస్) ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ మరో 176 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ విస్తరణ చేపట్టింది. దీనిలో భాగంగా 120 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ ప్రాజెక్టుతోపాటు, ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోనే 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర ద్యుత్ ప్రాజెక్టును నిరిళిస్తున్నది. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 286మెగావాట్ల సోలార్ స్థాపిత సామర్థ్యానికి ఎన్టీపీసీ చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లు రుసుం చెల్లించాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 29: ఇంటర్ నెట్ వైర్ల కోసం విద్యుత్ సంస్థ స్తంభాల వాడుకున్నందుకు ఇంటర్‌నెట్ ప్రొవైడర్లు రుసుం చెల్లించాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి ఎస్ఈ బొంకూరి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఒక పోల్ వాడుతున్నందుకు 20 రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో ఒక స్తంభానికి 15రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్ని స్తంభాలు వాడుతున్నారో వాటి వివరాలను సెక్షన్ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

రేపటి నుంచి గ్రామాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 29 : స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో గ్రామాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఏ.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం మే 1నుంచి 31 వరకు ఉదయం, సాయంకాలం నెల రోజుల పాటు డి. రమేష్ కోచ్ సమక్షంలో రేగడిమద్దికుంటలో టెన్నికాయిట్, వి సురేందర్ ఆధ్వర్యంలో రాఘవపూర్‌లో హ్యాండ్‌బాల్,ఏ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వెన్నంపల్లిలో బాక్సింగ్, ఎం.రాజు ఆధ్వర్యంలో అప్పన్నపేటలో వాలీబాల్, బి సతీష్ ఆధ్వర్యంలో జూలపల్లిలో వాలీబాల్, డి రాజు ఆధ్వర్యంలో కాల్వశ్రీరాంపూర్‌లో ఖోఖో, టి కుమార్ ఆధ్వర్యంలో బొంపల్లిలో వాలీబాల్, విష్ణు ఆధ్వర్యంలో కనగర్తిలో అథ్లెటిక్స్, కొమురయ్య ఆధ్వర్యంలో నందిమేడారంలో వాలీబాల్, ఎండి అస్లాం కోచ్ ఆధ్వర్యంలో గర్రెపల్లిలో వాలీబాల్ క్రీడల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 29: మండలంలోని అంకంపల్లి, మడిపల్లి, మడిపల్లికాలనీ, ఆషన్నపల్లి గ్రామాల్లో సోమవారం మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు గోపగోని సారయ్యగౌడ్ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు ఆకుల చిరంజీవి, కొత్తూరి మొండయ్య, కొక్కుల శంకర్, గోవర్ధన్, రాయమల్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గడువులోగా హోం ఓటింగ్ పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, ఏప్రిల్ 29 : ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులోగా హోం ఓటింగ్‌ను సజావుగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసే హక్కును ఎన్నికల కమిషన్ కల్పించిందని, దీనికి సంబంధించి రామగుండం సెగ్మెంట్ పరిధిలో వచ్చిన దరఖాస్తులకు ఆమోదించి వారికి ఇంటి వద్దనే ఓటువేసే ఏర్పాట్లు చేయాలన్నారు. హోం ఓటింగ్‌కు సంబధించి బృందాలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, రూట్ మ్యాప్, షెడ్యూల్ రూపొందించామని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా సంబంధిత ఓటర్లుకు షెడ్యూల్ సమాచారం అందించామన్నారు. బ్యాలెట్ పత్రాలను మే 2 నాటికి బృందాలకు అందజేస్తామన్నారు. మే 3 నంచి 8న మొదటి విడత, మే 9 రెండోవిడత హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అనంతరం మేడిపల్లిలోని బూత్‌లో ఓటరు స్లిప్పుల పంపిణీని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆమె వెంట పాలకుర్తి తహసీల్దార్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు.

రచయితల సదస్సుపై దాడి అమానవీయం : అరసం

గోదావరిఖని, ఏప్రిల్ 29: వరంగల్‌లో లౌకిక రచయితల ఫోరం నిర్వహించిన సదస్సుపై దాడి చేసి, బ్యానర్లు చించివేసి, రచయితలను దుర్భాషలాడడం, భౌతిక దాడికి దిగడం మతోన్మాద చర్య అని అమానవీయమని భారత అభ్యుదయ రచయితల సంఘం ఒక ప్రకటనలో పేర్కొన్నది. మతోన్మాద ఏబీవీపీ చర్యలు మంచిదికాదని, రాష్ట్ర ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి నేపథ్యంలోనే వివిధ ప్రజాస్వామిక, లౌకిక సంఘాలు, రచయితలు తెలంగాణ రాష్ట్రంలో సదస్సులు నిర్వహిస్తున్నారని, వీటిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఇలాంటి దాడులు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. వీటిని సహించేది లేదని, ఇలాంటి శక్తులను రాష్ట్ర ప్రభుత్వం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ గూటికి ఎంపీ వెంకటేష్ నేత

- పెద్దపల్లిలో మారనున్న రాజకీయ సమీకరణాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత భారతీయ జనతా పార్టీలో చేరారు. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ సమీకణాలు మారనున్నాయి.సోమవారం ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో చేరడంతో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న వెంకటేశ్ నేత ఈ ఎన్నికల్లో తనకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ రాదని, బీజేపీ, కాంగ్రెస్‌లో చేరాలని భావించారు. మొదట బీజేపీలో చేరితే ఆయనకే టికెట్ ఇస్తారనే ప్రచారం జరిగింది. ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దలు వెంకటేశ్ నేతకు గాలం వేశారు. తమ పార్టీలోకి రావాలని, టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. దీంతో ఆయన రెండు మాసాల క్రితం న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పార్టీ టికెట్ ఆయనకే వస్తుందనే ప్రచారం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ తీరా సమయానికి గడ్డం వంశీకృష్ణకు కట్టబెట్టింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్ నేత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీలో చేరిన తర్వాత కనీసం ఆయనను పట్టించుకున్న నాయకులు లేరు. ఆయన బీజేపీలో చేరుతున్నారని, అభ్యర్థిని మార్చి తనకే టికెట్ ఇస్తున్నారని ప్రచారం జరిగినా కూడా తన భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ నాయకులు సంప్రదింపులు జరిపి బుజ్జగించే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు పది రోజుల క్రితం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి తనకు పెద్దపల్లి టికెట్ ఇస్తే బీజేపీలో చేరతానని ప్రతిపాదన పెట్టారు. కానీ అది ఫలించలేదు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అడ్డుపడ్డారు. ఆయన ప్రోద్బలంతోనే అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ పార్టీలో చేరి టికెట్ తెచ్చుకున్నారు. శ్రీనివాస్, వెంకటేశ్ నేత ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. టిక్కెట్ ఇవ్వకపోయినా ఆయన బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో పాటు తన సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్ గెలుపు కోసం కృషి చేస్తానని పార్టీ పెద్దలతో చెప్పుకువచ్చారు. భవిష్యత్‌లో పార్టీలో మంచి పొజిషన్ కల్పించి ఏదైనా నామినేటెడ్ పోస్టు ఇస్తామని భరోసా ఇచ్చారని సమాచారం.



బీజేపీలో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత

మొత్తం మీద నిన్న మొన్నటి దాకా ఊగిసలాటలో ఉన్న వెంకటేశ్ నేత బీజేపీలో చేరడం తమ పార్టీకి కొంత బలం పెరిగనట్లేనని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

రూ.5లక్షల 54వేల నగదు పట్టివేత

పాలకుర్తి, ఏప్రిల్ 29: పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వాహనాల తనిఖీల్లో 5 లక్షల 54 వేల రూపాయలు పట్టుకున్నట్లు ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి నరేష్ వద్ద 54 వేల రూపాయలు, బసంత్‌నగర్‌కు చెందిన మీర్జా జాకీర్ బేగ్ వద్ద 5 లక్షల రూపాయలను సరైన అధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి షబ్బీర్ పాషా టీమ్‌కు అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

రామగుండాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా..

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29: రామగుండాన్ని సుందరంగా తీర్చిదిదుతానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం రాత్రి గోదావరిఖని వ్యాపార కూడలి లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కొలిపాక సుజాత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీటి బాలరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరగా వారికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

రామగిరి, ఏప్రిల్ 29: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా తనను ఆశీర్వదించినట్లయితే యువత ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేస్తానని పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గెలుపునకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంథని ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనుబాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

కమాన్‌పూర్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుందని పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రానికి రాగా దుద్దిళ్ల శ్రీనుబాబు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. గడ్డం వంశీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

- మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 29 : మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కుర్మపల్లి, రాగినేడు, పాలితం గ్రామాల్లో ఎంపీవో సుదర్శన్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఈఈ శ్రీనివాస్ అధికారులతో కలిసి ఇంటింటా తిరుగుతూ నీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భగీరథ నీరు ఎంత సమయం సరఫరా అవుతున్నాయో , నీరు సురక్షితంగా ఉంటున్నాయా ఎవైనా కలుషితంగా సరఫరాల అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో ఎక్కడైనా పైప్ లైన్‌లు లీక్ ఉన్నాయో మరమ్మతులు చేయాల్సిన ప్రాంతాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చేతి పంపుల మరమ్మత్తులు, పైప్‌లైన్ లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయిస్తున్నట్లు ఈఈ తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా అవసరానికి మించి నీరు సరఫరా జరుగదని, ప్రజలు సైతం అర్థం చేసుకోని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వారి వెంట ఎంపీవో సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధు, పంచాయతీ కార్యదర్శులు మంగ, శ్యాం, గీతాంజలితో పాఉట సిబ్బంది ఉన్నారు.



కుర్మపల్లిలో తాగునీటి సరఫరాపై అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాస్

పశుగ్రాసం దగ్ధం

వీణవంక, ఏప్రిల్ 29: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పశుగ్రాసం కాలిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ బ్రాహ్మణపల్లిలో గడ్డి కొనుగోలు చేసి సోమవారం వ్యాన్(టీఎస్12 యూడీ 1470)లో తీసుకె ళుతున్నాడు. గ్రామ శివారు నుంచి వ్యాన్ వెళ్తుండగా విద్యుత్ తీగలు గడ్డికి తగిలాయి. రాపిడికి మంటలు లేచి అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి గడ్డి మొత్తం కాలిపోయింది. వ్యాన్‌సైతం 70శాతం కాలిపోయింది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండలంలోని మల్యాల గ్రామ శివారులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టిబడింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలానికి చెందిన పామెర రమేశ్ అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై రూ. 9,500 విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్

కోరుట్ల, ఏప్రిల్ 29: పట్టణంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను సోమవారం వేకువజామున వ్యాన్ ఢీకొట్టింది. దీంతో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసి గోడ పూర్తిగా దెబ్బతిని దానికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభం కొంత మేర రోడ్డుకు ఒక వైపు ఒరిగింది. ప్రమాద సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపల్ ఏఈ లక్ష్మి సంబధింత విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ కిరణ్ కుమార్ పరిశీంచి విచారణ చేపట్టారు.


ధ్వంసమైన డివైడర్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ కేసులో ఒకరికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. జిల్లాలోని గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన తుమ్మ మధుకర్ అనే వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రంకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- బద్దిపోచమ్మకు మొక్కు చెల్లింపు


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 29: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో వేములవాడ పుణ్యక్షేత్రం కిటకిట లాడింది. ఈ సందర్భంగా వారు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. సోమవారం సందర్భంగా ఆలయ అధికారులు లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్య లో భక్తులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కంప్యూటర్ వర్క్‌పేరిట సైబర్ మోసాలు

- కంబోడియాలో నరకయాతన అనుభవించిన బాధితుడు - ఇంటికి చేర్చిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29: 'కంప్యూటర్ వర్క్ పేరిట సైబర్ మోసాలకు సంబంధించిన కాల్స్ చేయించారు. ప్రతీ రోజు 16గంటలు పనిచేయించారు. ఇంటికి వెళ్తానంటే పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. కంబోడియాలో నరకయాతన అనుభవించాను' అని సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు అతికం శివ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మీ తన కుమారుడు శివప్రసాద్ కంబోడియాలో ఇబ్బందులు పడుతున్నాడని గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవ తీసుకున్నారు. కంబోడియాలో సైబర్ ముఠా చెరలో చిక్కుకున్నట్లు తెలుసుకున్న పోలీసుల కృషి ఫలితంగా శివప్రసాద్ ఆదివారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. కంబోడియాలో పడిన ఇబ్బందులపై సోమవారం ఓ వీడియో విడుదల చేశాడు. ముందుగా తన విడుదలకు కృషి చేసిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం తన ఆవేదనను చెప్పుకొచ్చాడు. ఉద్యోగ అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లాలనుకున్న తాను కొడిమ్యాలకు చెందిన ఏజెంట్‌ను కలిశానని, కంబోడియాలో కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి చైనీస్ కంపెనీ పేరిట ఉన్న కాల్ సెంటర్‌లో పెట్టించాడని పేర్కొన్నాడు. అక్కడ సైబర్ మోసాలకు పాల్పడే పనులు చేయించారని చెప్పాడు. కంబోడియాలో వందలాది మంది యువకులు తనలాగే నరకం అనుభవిస్తున్నారని, ఇలాంటి బాధలు ఎవరికీ రావద్దని ఆవేదన వ్యక్తం చేశాడు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు విదేశాలకు వెళ్లేవారు అనుమతి ఉన్న ఏజెన్సీలను ఆశ్రయించాలని కోరాడు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

చందుర్తి ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం (55) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశం ఆదివారం చందుర్తి నుంచి మోత్కురావుపేటకు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల వద్ద రోడ్డుపై అడ్డుగా పెట్టిన బండరాళ్లను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మల్లేశం మృతిపై ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడు దాడి

మల్లాపూర్, ఏప్రిల్ 29: మండలంలోని అడవి రేగుంట గ్రామానికి చెందిన రాజారెడ్డిపై ఆస్తి పంపకాలు చేయాలని తనయుడు శేఖర్ సోమవారం దాడికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాజారెడ్డితో ఆస్తి పంచి ఇవ్వాలని కొంత కాలం నుంచి కొడుకు శేఖర్ గొడవ పడుతున్నాడు. సోమవారం ఆస్తి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రాజారెడ్డి తన భూమికి చెందిన పట్టా పాస్ బుక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లేందుకు గ్రామంలోని బస్టాండుకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో ఉన్న రాజారెడ్డిని గమనించిన శేఖర్ పారాతో తలపై దాడి చేశాడు. దీంతో రాజారెడ్డి తీవ్ర రక్తస్రావంతో కిందపడిపోయాడు. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29: జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం అని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో ఆసక్తి కలిగిన పిల్లలకు, యువతీ యువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ కళలను భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పాశ్చాత్య కళలకు ఆకర్షితులవుతున్న నేటి యువత మన కళా వైభవాలను మరిచి పోవడం బాధాకరమన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారులు, డ్యాన్స్ మాస్టర్ రతన్ కుమార్ మాట్లడుతూ వారానికి లేదా పక్షానికి ఒక రోజు కరీంనగర్‌లో మన తెలంగాణ పేరిణి శివతాండవం, పేరిణి లాస్య శిక్షణా తరగతులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి గల యువత నాట్యాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రముఖ నృత్య కళాకారులు ఇంజనీరు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్ శాస్త్రీయ నర్తకి కుమారి స్నేహితలను ఆచార్య మల్లేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు.


కళాకారులను సన్మానిస్తున్న వీసీ సంకసాల మల్లేష్

తప్పుడు ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నం

చొప్పదండి, ఏప్రిల్ 29: తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసేందుకు యత్ని స్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండిలోని సర్వే నంబరు 439, 440, 441 లో సుద్దాల వెంకటస్వామి అనే వ్యక్తి రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం వెంకటస్వామి మహేందర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించాడు. అనంతరం పలువురు కొనుగోలు, అమ్మకాలు జరిపారు. కొంత కాలం తరువాత ఆ భూమిని చొప్పదండికి చెందిన కృష్ణహరి కొనుగోలు చేశాడు. కాగా సుద్దాల వెంకటస్వామి ఆ భూమి తనదేనని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ పొందాడు. అనంతరం తనను మోకాపైకి రానివ్వకుండా వెంకటస్వామి బెదిరి స్తున్నాడని కృష్ణహరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీనిపై విచారణ జరిపి సుద్దాల వెంకటస్వామి, అతడి భార్య తరుణిపై కృష్ణహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటస్వామి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్


పట్టుబడ్డ హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ పోలీ స్స్టేషన్‌లో హెడ్‌కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సామి ల్ల మనోహర్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మం డలం పెరుకపల్లి గ్రామానికి చెందిన బాల తిరుపతి నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్ వెళ్లకంటే ముందు ఓ భూవివాదం కేసులో నేరస్థుడుగా ఉన్నాడు. ఈ కేసు విషయంలో తిరుపతిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీకాగా కోర్టుకు గైర్హాజరయ్యాడు. ఈ కేసు విషయమై బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ దగ్గర రూ.5 వేలు డిమాండ్ చేయగా ఈ నెల 16వ తేదీన గూగుల్‌పే‌ద్వారా రూ. 5 వేలు రూపాయలను హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ కు పంపించాడు. ఇవే కాకుండా మరో రూ.5 వేలు అదనంగా లంచం కావాలని హెడ్‌కానిస్టేబుల్ బాధితుడి మామ కట్కం గంగాధర్‌ను బలవంతం చేశాడు. దీంతో దుబాయ్ నుంచి బాధితుడు తిరుపతి ఏసీబీ డీజీపీకి మెయిల్ ద్వారా హెడ్‌కాని స్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జగిత్యాల మండలం లోని పెరుకపల్లి రాజీవ్‌చౌరస్తా వద్ద బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ వద్ద నుంచి హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ రూ. 5 వేలు లంచం తీసుకుం టుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు క్రిష్ణకుమార్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌కు చేరిన ఫుట్‌బాల్ పోటీలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జట్లు సెమిఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో వనపర్తి జట్టు, రంగారెడ్డి, వరంగల్ జట్ల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి, రంగారెడ్డి, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం సెమీఫైనల్స్ పోటీలు అనంతరం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్‌ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేష్ పాల్గొన్నారు.


మ్యాచ్ ఆడుతున్న వనపర్తి, నల్గొండ జట్లు

చరిత్ర పరిశోధకుడు శ్రీనివాసరాజు మృతి


శ్రీనివాసరాజు(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29: కరీంనగర్‌లో నివాసముంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వేంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు(61) శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. శ్రీనివాసరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారులు కీర్తిచంద్ర, శ్రీచైతన్య ఉన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో టైపిస్టుగా చేరిన ఆయన కరీంనగర్, పెద్దపల్లి, చొప్పదండి, కాటారం ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకునిగా, ప్రాచా ర్యునిగా పనిచేస్తూ చొప్పదండిలో 2020లో పదవీ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రిన్సెస్ యశోధర చారిత్రక నాటకం, ముసున్నూరి కాపయనాయకుడు చారిత్రక పరిశోధక నవల, భరతావని చారిత్రక కావ్యం, బహద్దూర్ కొండాలరాయుడు చారిత్రక నవల, బొమ్మలమ్మగుట్ట చక్రేశ్వరీదేవి శతకం, హిస్టరీ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన సంరక్షణ కవితలు, భగవద్గీత-సోపానములు (అనువాదం) వంటి పుస్తకాలను రచించారు. శ్రీనివాసరాజు మృతి పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్జిత సేవల బుకింగ్ క్లర్క్‌పై దాడికి యత్నం

వేములవాడ, ఏప్రిల్ 29: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆర్జితసేవల బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న క్లర్క్‌పై భక్తులు దాడికి యత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాజన్న ఆలయంలో భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలలో భాగంగా నిత్యం స్వామివారి నిత్య కల్యాణం జరిపిస్తుంటారు. ఆలయం తూర్పు భాగంలో ఉన్న కళాభవన్‌లో నిర్వహించే స్వామివారి నిత్యకల్యాణం కోసం భక్తులకు రోజూ గరిష్ఠంగా 150 నుంచి 160 టికెట్ల వరకు విక్రయిస్తారు. ఒక టికెట్‌పై ఒక జంటను లేదా ఇద్దరిని అనుమతిస్తారు. రద్దీ తక్కువగా ఉన్న రోజుల్లో టికెట్లు కొనుగోలు చేసిన వారి కుటుంబ సభ్యులను కూడా అనుమతిస్తారు. సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో 157 టికెట్లు జారీ చేశారు. వీటికి నాలుగు శాశ్వత కల్యాణం టికెట్లు తోడు కావడంతో మొత్తం టికెట్ల సంఖ్య 161కి చేరింది. దీంతో స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపివేశారు. అప్పటికే చాలాసేపటి నుంచి స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం క్యూ లైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు వాగ్వాదానికి దిగి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ క్రమంలో బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు అక్కడికి చేరుకుని భక్తులను శాంతింపజేశారు. స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం తదితర ఆర్జిత సేవల టికెట్ల జారీ విషయంలో భక్తులకు తగిన సమాచారం ఎప్పటికప్పుడు అందించకపోవడంతో తరచూ భక్తులు గొడవ దిగుతున్నారని ఆలయ సిబ్బంది వాపోయారు. ఆర్జిత సేవల టికెట్ల జారీకి సంబంధించిన ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 23మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర .5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తప్పిపోయిన మహిళను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: ఎనిమిదేళ్ల క్రితం తప్పిపోయిన దోమల రాములమ్మను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి ఆదివారం రాత్రి గుర్తుతెలియని మహిళ వచ్చిందనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. విచారించగా తనపేరు రాములమ్మ అని తెలిపింది. దీంతో పోలీసులు సిరిసిల్లలోని సఖిసెంటర్‌కు పంపించారు. సోమవారం మహిళకు సంబంధించిన వివరాలు సేకరించగా ఖమ్మం జిల్లావాసిగా గుర్తించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీసులు సమాచారం ఇవ్వగా వారు కిష్టాపూర్ గ్రామపెద్దలకు విషయం చెప్పారు. దీంతో రాములమ్మ కుమార్తె రమాదేవి సిరిసిల్లకు చేరుకుంది. తన తల్లి ఎనిమిది సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిందని, మతిస్థిమితం సరిగా ఉండదని తెలిపింది. తప్పిపోయిన తన తల్లిని అప్పగించినందుకు ఎస్సై, సఖిసెంటర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పింది.

విద్యార్థుల కోసం టెలీమానస్ ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: పదో తరగతి(ఎస్‌ఎస్‌సీ) పరీక్షా ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా ఫెయిల్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబరు 14416 ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకూడదని, తిరిగి పరీక్ష రాసి పాసయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకూడదని, ఒత్తిడి జయించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు వైద్యుల సలహాలు సూచనలకు టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా వెంచర్ చేసి సీసీ రోడ్డు వేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శించిన జడ్జి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం, స్వధార్ హోమ్, బాలసదన్, శిశు గృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యవ్వనంలో ఆకర్షణకులోనై దానిని ప్రేమగా భావించి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదువుకొని జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ప్రేమ గురించి ఆలోచించాలని చెప్పారు. అప్పటి వరకు చదువుపై శ్రద్ధవహించాలని కోరారు. బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలసదన్ పిల్లలకు సూచించారు. పాఠశాల నుండి వచ్చిన వెంటనే పరిశుభ్రతను పాటించాలని అన్నారు. శిశు గృహం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పిల్లలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం, స్వధార్ హోం, బాలసదన్ నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 29: బీజేపీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ వద్ద హమాలీ సంఘం కార్యాలయంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్, దాసరిప్రభాకర్, గందు మహేందర్, ఐతము రఘుపతి, జెట్టి రాజు, బొడ్డు శంకరయ్య, గాండ్ల రవీందర్, తంగెళ్లపల్లి రాజు, కాసెట్టి శ్రీనివాస్, తంగెళ్లపల్లి స్వామి,తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 29: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో బీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోమాసే మాట్లాడుతూ మాట్లాడుతూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ప్రబారి నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ సుహాసినిరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి తాత రవి, నాయకులు పర్వతాలు, కందుల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోమాస శ్రీనివాస్ ను గెలిపించాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు వడ్లకొండ మహేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గర్రెపల్లిలో ప్రదాన వీదుల గుండా వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను చేశారు. కార్యక్రమంలో మహేష్‌తోపాటు నాయకులు మద్దెల రాజు, పోచంపల్లి సంతోష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల గెలుపు కోసం ప్రచారం

ధర్మారం, ఏప్రిల్ 29: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం మండలం పైడిచింతలపల్లి, బొట్లవనపర్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు మోహన్‌రెడ్డి, జితెందర్‌రావు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జ్యోతినగర్, ఏప్రిల్ 29 : అమలుకు సాధ్యంకాని వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందని బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సోమవారం స్థానిక బీవీ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రచారం సభలో కొప్పుల ప్రసంగించారు. అంతకు ముందు కొప్పుల ఈశ్వర్ ఎన్టీపీసీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

జూలపల్లి, ఏప్రిల్ 29 : మండలంలోని పెద్దాపూర్‌లో సోమవారం బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటువేయాలని కోరుతూ పార్టీ నాయకులు ఓట్లు అభ్యర్థించారు. ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మీనర్సయ్య, స్వామి, అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు గోపగోని సారయ్యగౌడ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపు కోసం సమిష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు చేతి ధర్మయ్య, పులి ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీటీసీ రావి సదానందం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

అంతర్గాం, ఏప్రిల్ 29: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు బందారపు బుగ్గరాములుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమవారం రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియా రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్కే ఇఫ్తాకర్ అహ్మద్, ఈదునూరి హరి ప్రసాద్, సూర తార, సిరిశెట్టి సతీష్ గౌడ్, ఎండీ తాజుద్దీన్, ఇబ్రహీం,కోయ అనితాచౌదరి, జబ్బార్ పాల్గొన్నారు.

కాలనీలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ సోమవారం పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో 17, 19 డివిజన్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ సాగంటి శంకర్, నాయకులు అనము రాములు, తిరుపతి రెడ్డి, కుమార్, రజిత, సురేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని నిమ్మనపల్లి, నిట్టూరు, తుర్కల మద్దికుంట, కాసులపల్లి, పాలితం, గోపయ్యపల్లి గ్రామాల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని కోరుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు సందనవేని రాజేందర్ యాదవ్, ప్రదీప్, సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని లాలపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పడాల పర్శరాంగౌడ్, కొప్పర తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరవై వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

కమాన్‌పూర్, ఏప్రిల్ 29 : రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 60వేల టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం మండలంలోని గుండారంలోని పీఏసీఎస్, మండల కేంద్రంలో సెర్ప్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వరిధాన్యం విక్రయాలు, హమాలీల సంఖ్య, అక్కడి కేంద్రాలలోని పరిస్థితులు, కాంటాల నిర్వహణ ఏ సమయాల్లో నిర్వహిస్తున్నారు, రిజిస్టర్‌ల నిర్వహణ తీరులను పరిశీలించడంతో పాటు సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నిత్యం జిల్లాలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ అక్కడ ఏమైనా సమస్యలు ఉన్నాయో.. అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ధాన్యం విక్రయిచిన రైతులకు డబ్బులు కూడా వారి ఖాతాల్లో ఆలస్యం జరగకుండా జమ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అరిపోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ సుదాటి కోటేశ్వర్‌రావు, ఆర్ఐ సుముదాని, ఏపీఎం శైలాజాశాంతి, పీఏసీఎస్ కార్యదర్శి తిమ్మరాజు, సంతోష్‌కుమార్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.



గుండారంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

రామగిరి : మండలంలోని నాగేపల్లి, లద్నాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను సోమవారం అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ తనిఖీ చేపట్టారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు సంబంధించిన ధాన్యం తేమశాతం చూసి వెంటనే కొనుగోలు చేపట్టి రైసు మిల్లులకు తరలించాల్సిందిగా ఆదేశించారు. ధాన్యం కొతలకు గురికాకుండ చూసుకోవాల్సిందిగా సూచించారు. కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం మిల్లుకు చేరే వరకు సిబ్బందిదే బాధ్యత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్‌లు, హమాలీల సమస్య లేకుండా చేసుకోవాల్సిందిగా సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాంచందర్‌రావు, డిటి రాకేష్, ఏపీఎం స్వరూపరాణి, ఆర్ఐ రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవోలు



పన్నూరులో పోలింగ్ చిట్టీలను అందిస్తున్న మంథని ఆర్డీవో



అంకంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో గంగయ్య

రామగిరి, ఏప్రిల్ 29: మండలంలోని పన్నూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆర్డీవో హనుమానాయక్ పరిశీలించారు. గ్రామంలో పలువురికి ఆర్డీవో చేతుల మీదుగా పోలింగ్ చిటిలను అందజేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి పోలింగ్ చిట్టీలను అందేలా చర్యలు చేపట్టాలని అదికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాంచందర్‌రావు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

మండలంలోని పన్నూరు సెంటర్‌లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ఓటరు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, ఎంపీటీసీ చిందం మహేష్, కళాకారులు జనగామ రాజనర్సు, పద్మ, కోంఢ్ర వెంకన్నగౌడ్, బుర్రశంకర్‌గౌడ్, కొండ శ్రావణ్, రమా పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని అంకంపల్లె, ఆశన్నపల్లె, మడిపల్లికాలనీ, మడిపల్లి, పెగడపల్లి, గంగారం, పెద్దంపేట,పందిళ్ళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డీఓ గంగయ్య సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని గదులను పరిశీలించారు. తాగునీరు అందుబాటులో ఉండాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు సరిగా ఉండాలన్నారు.

ఆర్‌డీవో వెంట తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీవో గోవర్ధన్, ఆర్ఐ ఉదయశ్రీ, గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మే డేను విజయవంతం చేయాలి : ఐఎఫ్‌టీయూ

జ్యోతినగర్, ఏప్రిల్ 29 : మేడేను ఎన్టీపీసీ ప్రాంత కార్మిక వర్గం విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ కోరారు. సోమవారం యూనియన్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో శంకర్ పామాట్లాతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ సర్కారు కార్మిక వ్యతిరేఖ విధానాలకు పాల్పడతున్నదని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా 138వ మేడేను నిర్వహిస్తున్నామన్నారు. గత 10 ఏళ్లలో దేశంలో అనేక ప్రభుత్వ పరిశ్రమలు మూత పడ్డాయని, పలు కంపెనీలు ప్రైవేటు పరమయ్యాయన్నారు. బడా వ్యాపారులకు ప్రయోజనం కల్గించే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంఉన్నదని విమర్శించారు. కార్మికుల చట్టాలను సవరిరచారని, కొత్తగా తీసుకవస్తున్న లేబర్ కోడ్ల వల్ల కార్మికులు, యూనియన్లకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కుతోపాటు పలు హక్కులను కోల్పోక తప్పదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే వేడే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి, నాయకులు బుచ్చన్న, రాయమల్లు, సుధాకర్, కుమార్, రవిందర్, వెంకటస్వామి, వసంత్, రమేష్, మహేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత చిలుక శంకర్

రెండు క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

అంతర్గాం, ఏప్రిల్ 29: రామగుండం రైల్వే స్టేషన్‌లో అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం సుమారు రెండు క్వింటాళ్లను పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. రైలులో నల్లబెల్లం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు రామగుండంలో ఆగిన అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీ నిర్వహించగా నల్లబెల్లం పట్టుబడినట్టు సీఐ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న నల్లబెల్లంను రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్‌కు అప్పజెప్పినట్టు పేర్కొన్నారు. రైళ్లలో అక్రమంగా రేషన్ బియ్యం, కలప, గంజయి, బెల్లం తరలిస్తే చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, లోకింద్ర, ఓంవీర్, దినేష్, చందు పాల్గొన్నారు.



పట్టుకున్న నల్లబెల్లాన్ని చూపిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

గుండెపోటుతో సింగిల్‌విండో డైరెక్టర్ మృతి

ధర్మారం, ఏప్రిల్ 29 : ధర్మారం మండలం పత్తిపాక సింగిల్‌విండో డైరెక్టర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి సోదరుడు గుజ్జుల రాజనరేందర్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు. అతని దహన సంస్కారాలు స్వగ్రామమైన కమ్మర్‌ఖాన్‌పేటలో మంగళవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద తాళ్లపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మనోజ్ గౌడ్, రఫీక్, తుమ్మ రాజ్‌కుమార్, జూపాక కుమారస్వామి, మదు, రమేష్, నాంపల్లి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దరియాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

ముత్తారం, ఏప్రిల్ 29: మండలంలోని దరియాపూర్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుమాన్ తెలిపారు. అంటరానితనంపై అవగాహన, ఎస్సీ, ఎస్టీ చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు అయన తెలిపారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలి

ఓదెల, ఏప్రిల్ 29 : మే 3న ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర సమితి సభ్యులు తాళ్లపల్లి సురేందర్ ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లో, గ్రామాల్లో జిల్లా కేంద్రాల్లో ఏఐవైఎఫ్ జెండా ఎగురవేయాలని సురేందర్ కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి రాజీనామా

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: సుల్తానాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ఒక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వ్యవహార శైలి నచ్చకనే పార్టీని వీడుతున్నట్లు ప్రేమ్ చందర్ పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలను మనోహర్‌రెడ్డి ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. మనోహర్‌రెడ్డిలాంటి నాయకులతో పార్టీ ప్రతిష్ట దిగజారడమే కాకుండా కార్యకర్తలు దిక్కులేని వారయ్యారని అన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు'

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 29: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతు ఇస్తున్నట్లు యాదవ యువత నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు యాదవులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పొన్నం. రమేష్ యాదవ్, కనికిరెడ్డి చంద్ర శంకర్ యాదవ్, మేకల మధు యాదవ్, బతుల లింగన్న యాదవ్, చిట్టవేన వినీత్ యాదవ్, రాపాక నవీన్ యాదవ్, నాంసాని మొండయ్య యాదవ్, గడ్డం కుమార్ యాదవ్, రాజశేఖర్ యాదవ్, రాజ్ కుమార్ యాదవ్, చింతల మనోజ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మే డేను ఘనంగా జరుపుకోవాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: అన్ని కార్మిక అడ్డాలలో మే డే సంబరాలను జరుపుకోవాలని, ఎర్రజెండాలు ఎగురవేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం సుల్తానాబాద్‌లో ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కార్మికవాడల్లో మేడే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య, ఉపేందర్, చిరంజీవి, సంపత్, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల తిరుపతి, సంపత్, శంకర్, శ్రీను, గణేష్, సుమన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం'

ముత్తారం, ఏప్రిల్ 29: మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మఆనంద్ అన్నారు. మండలంలోని మచ్చుపేట గ్రామ శివారులోని బగుళ్ళగుట్టకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేశామని అన్నారు. సోమవారం బగుళ్ళ గుట్టకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్యపు ఆరోపణలు చేసున్నారని వారు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి కుమార్, మాజీ ఎంపీపీ గొర్ల రాజయ్య, మాజీ సర్పంచ్ మెడగోని సతీష్, మాజీ వార్డు సభ్యులు రాకేష్, యూత్ అధ్యక్షులు కలవెన దేవరాజ్, సీనియర్ నాయకులు దుండే రాజేశం, భక్కతట్ల రామ్మూర్తి, బొడ్డు రవీందర్ గొర్ల స్వామి, కిలిషెట్టి తిరుపతి, చిలువేరి లక్ష్మణ్, మడ్డి రవి, దుండే రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి, ఏప్రిల్ 29: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 33 సంవత్సరాల తరువాత సోమవారం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తోటి మిత్రులను ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో తాజొద్దీన్, కనుకయ్య, ఎం శంకర్, మంజులత, సరిత, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చండి

ఓదెల, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలోని ప్రతి వీధిలో తాగునీటి సమస్య అధికమైందని, వెంటనే పరిష్కరించాలని సోమవారం బీఆర్ఎస్ నాయకులు కనికిరెడ్డి సతీష్, చింతం మొగిలి, తీర్థాల కుమార్ జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామంలో ఉన్న తాగు నీటి పైపలైన్ ఏమాత్రం ప్రజలకు ఉపయోగపడడం లేదన్నారు. నల్లాలున్న చోట తాగునీటి సరఫరా సక్రమంగా లేదని పేర్కొన్నారు. గ్రామంలో గత మాసం నుంచి తాగునీటి కొరత ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం వేసవి ఎండ ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ప్రతి వీధిలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

ఉపాధిహామీ కూలీలకు మహిళా చట్టాలపై అవగాహన

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 29: పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మహిళా చట్టాలపై మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భోజన్నపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్య, సిబ్బంది, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా కేశవరెడ్డి

రామగిరి, ఏప్రిల్ 29: జిల్లా ట్రస్మా అధ్యక్షుడిగా మండలానికి చెందిన ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన జనరల్ బాడి సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారులు సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో కేశవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, కోశాధికారిగా ఓదేలు, ఉపాధ్యక్షులుగా సంజీవ్, భాస్కర్, అశోక్, సంయుక్త కార్యదర్శిగా కుమార్, ప్రచార కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, అయ్యాజ్, కార్యవర్గ సభ్యులుగా రోహిత్, సతీష్, సురేందర్, రాష్ట్ర ప్రతినిధులు అల్లంకి శ్రీనివాస్, మల్లోజుల విజయ్‌నంద్, శ్రీనివాస్‌రెడ్డి ఉమామహేశ్వర్‌లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా శంకర్


పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 29: పెద్దపల్లి మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కొత్తపల్లికి చెందిన ఎలబోతారం శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండలంలో రేషన్ డీలర్ల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు బండారి వెంకటేష్, జనరల్ సెక్రెటరీ మద్దెల నర్సయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా భూషణవేణ సురేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శిగా గాండ్ల రవికుమార్, ఉపాధ్యక్షులుగా గుజ్జుల రవిందర్, సలేంద్ర పద్మ, ప్రచార కార్యదర్శిగా బండ సంతోష్, కోశాధికారిగా పిల్లల మర్రి పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ మండల అధ్యక్షుడు బందరి ప్రభాకర్, రాంపల్లి, మండల రేషన్ డీలర్లు సురేష్, శ్రీనివాస్, పద్మ, సరస్వతి, అరికిల్ల గంగారం, పరశురావగౌడ్, చంద్రయ్య, పుల్లూరి భూమయ్య, మంగ, రాజేశ్వరి, పోచమల్లు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించండి

గోదావరిఖని, ఏప్రిల్ 29: లోక్‌సభకు జరుగుతున్న బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు అధికార పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలన్నీ కూడా ప్రజలను మళ్లీ మోసగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయన్నారు. బీజేపీ, ఎన్‌డీఏలు, కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలు కార్పొరేట్‌లకు, సామ్రాజ్యవాదులకు సేవకులుగా మారి అధికారం కోసం, తద్వారా దేశ సంపదను దోచుకునేందుకు ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలు రాజ్యాధికారం సాధించుకునేందుకు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నీతిగా, నిర్భీతిగా, నిజాయితీగా ఓటు వేయాలి...

కోల్‌సిటీ, ఏప్రిల్ 29: నీతిగా, నిర్భీతిగా, నిజాయితీగా ఓటు వేయాలని రామగుండం నగర పాలకసంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని బస్‌స్టాండ్ వద్ద స్వీప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మనోహర్, పబ్బాల శ్రీనివాస్, అశోక్, విష్ణుప్రియ, పాల్గొన్నారు.



ఓసీపీ-3 క్యాంటీన్‌లో భోజన సదుపాయం ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 29: ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 క్యాంటీన్‌లో కార్మికుల సౌకర్యార్థం యాజమాన్యం సోమవారం భోజన వసతిని ప్రారంభించింది. ప్రాజెక్టు అధికారి మధుసూదన్ కార్మికులకు భోజనం అందించి ప్రారంభించారు. ఏఐటీయూసీ కృషి మేరకు భోజన వసతి కల్పించినట్లు నాయకులు ప్రకాష్, రాజారత్నం, రవీందర్ తెలిపారు. ఇటీవల ఓసీపీ-3 పర్యటనకు వచ్చిన సీఎండీ బలరాంకు యూనియన్ పక్షాన సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. కార్మికుల సౌలభ్యం కోసం క్యాంటీన్‌లో భోజనాల సదుపాయం కల్పించాలని కోరిన మీదట సీఎండీ అంగీకరించి అమలు చేయించినట్లు పేర్కొన్నారు.

మేడే కరపత్రం ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 29: ఆర్జీ-2 ఏరియాలోని సివిక్ జోన్లలో సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మేడే ఉత్సవాల్లో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, పద్మ, దుర్గమ్మ, రాజేషం తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-1 దుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 29: ఓసీపీ-1 సైటాఫీస్‌లోని దుర్గాదేవి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. అర్చకులు జగన్నాథాచార్యులు, శ్రీనివాసాచార్యులు అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈపూజల్లో పీఓ రాధాకృష్ణ, మేనేజర్ ఉదయ్ హరిజన్‌తో పాటు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు డీ తిరుపతిరావు, గడ్డం తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

- బాయిబాటలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 29: కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం ఆర్జీ-1 పరిధిలోని ఓసీపీ5లో బాయిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు ప్రసాదిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులకు న్యాయం జరుగలేదని, సింగరేణి కార్మికుల నుంచి ఏ పనికైనా డబ్బులు వసూలు చేశారన్నారు. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా సింగరేణిలో డిపెండెంట్లకు కారుణ్య నియామకపత్రాలను అందజేసిన కాంగ్రెస్ పార్టీ అని, సింగరేణి కార్మికులకు త్వరలో సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. అదేవిధంగా కార్మికులకు ట్యాక్స్‌లు ఎత్తివేయడానికి కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలని, ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ నాయకులను కార్మికులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మహిళా కార్మికులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

క్వార్టర్లు కూల్చివేయ వద్దంటూ కార్మికుల నిరసన దీక్ష

గోదావరిఖని, ఏప్రిల్ 29: తాము 30ఏళ్లుగా రెండు తరాలుగా ఇక్కడే బ్రతుకుతున్నామని, సింగరేణి సేవ చేస్తున్నామని, సింగరేణి సంస్థ కేటాయించిన క్వార్టర్లను రోడ్డు వెడల్పు కోసం కూల్చివేసి తమ బ్రతుకులను బజారున వేయవద్దని పలువురు సింగరేణి కార్మికులు నిరసన దీక్షకు దిగారు. స్థానిక పోచమ్మ దేవాలయం ముందు సోమవారం ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. రోడ్డు వెడల్పు సహేతుకంగా జరుగాలని, ఇప్పుడున్న రోడ్డు వెడల్పు రెండు వైపులా జరుగాలి కానీ ఒకేవైపు రోడ్డు వెడల్పు చేస్తామనడం సరైందికాదన్నారు. అది 150ఫీట్ల మేర మూడు క్వార్టర్లను పడగొడుతూ మమ్ములందరిని వేరే చోటికి పంపితే బ్రతకలేమని కంటతడి పెట్టుకున్నారు. సింగరేణి యాజమాన్యం రాజకీయ జోక్యానికి తలొగ్గి ఏకపక్షంగా తమ కుటుంబాలను రోడ్డు పాలు చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ జీవిస్తున్న తామందరి సామాజికజీవితాలను, అనుబంధాలను భగ్నం చేస్తూ కక్ష సాధింపు తరహాలో సింగరేణి వ్యవహరించడం సమంజసం కాదని వారన్నారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రోడ్డు వెడల్పు ప్రజాసమ్మతంగా నిర్వహించాలని కోరారు. సింగరేణి చర్యను కోర్టు తప్పుబట్టినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం కార్మిక వ్యతిరేక విధానమని దీక్షలో పాల్గొన్న కార్మికులు పేర్కొన్నారు. తమ న్యాయమైన పోరాటానికి కార్మిక సంఘాలు కలిసి రావాలని కోరారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమ నిర్ణయాలను ఉప సంహరించుకోవాలని వారన్నారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు మాదాసు లక్ష్మయ్య, రామస్వామి, దబ్బెట సతీష్, దాసు, నర్సింహా, నవీన్, శ్రీనివాస్, అజీమ్, రాంబాబుతో పాటు తోట వేణు తదితరులు పాల్గొన్నారు.